ఉత్తమ ఫలితాలతో ఆదర్శంగా నిలవాలి


కొడకండ్ల: పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ


దేవరుప్పుల: బాలయేసు పదో తరగతి విద్యార్థులు


చిల్పూరు: బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్


తరిగొప్పుల: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొడకండ్ల: విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా శ్రద్ధగా చదువుకొని పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలవాలని ఎంపీపీ జ్యోతి, ఎంపీడీఓ సురేందర్‌నాయక్ సూచించారు. శుక్రవారం మొండ్రాయి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పూర్వ విద్యార్థి తండ్రి ఉపేందర్, దేవస్థాన డైరెక్టర్ దొపాటి నర్సయ్యలు బహూకరించి పరీక్ష ప్యాడ్లు, పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. సర్పంచ్ ఊర్మిల, హెచ్‌ఎం రజియాభేగం, ఎస్‌ఎంసీ చైర్మన్ ఉప్పలయ్య, గురుకుల ప్రిన్సిపాల్, సంధ్యారాణి, సీపీ యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలయేసు టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం జూనియర్లు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసు రాజు అధ్యక్షత వహించగా సూర్యాపేట హోలీపేయిత్ ఫాదర్ దీలీప్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసేందుకు దోహదపడే పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడిలకు లోనుకాకుండా రాయాలని సూచించారు. ఈ సందర్భంగా జూనియర్లు పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు తదితర సామాగ్రి అందజేశారు. ఉపాధ్యాయులు ఖాజా, రమాదేవి, భాస్కర్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ఇంటర్ తొలిమెట్టు

చిల్పూరు: పది పూర్తి చేసుకొన్న విద్యార్థుల ఉన్నత చదువులకు ఇంటర్ తొలిమెట్టు అని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, రోటరీ క్లబ్ సభ్యులు దారం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం హెచ్‌ఎం నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులో పోటీతత్వం ఉండాలని అన్నారు. రోటరీ క్లబ్ సభ్యుడు దారం శ్రీనివాస్ టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ అందజేశారు. హెచ్‌ఎం నర్సింహారెడ్డి, పీఈటీ వంచ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కోమళి, వనజ, బి.లక్ష్మి, ప్రకాష్, వి.లక్ష్మి, నరసింహారావు, సురేష్, కేకే మూర్తి, వంశీధర్, రమణకుమార్, సుబ్బారెడ్డి, శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీధర్ ఉన్నారు.

ఫేర్ వెల్ డే వేడుకలు

తరిగొప్పుల: మండలకేంద్రంలో జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల ఫేర్ వెల్ డే వేడుకలు హెచ్‌ఎం రామచంద్రం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ జంగ వీరయ్య, వైస్ చైర్‌పర్సన్ రజిత, ఉపాధ్యాయులు మచ్చ చిరంజీవులు, జోసఫ్‌బేబి, ప్రవీణ్, అడెపు శ్రీనివాస్, కందకట్ల నీరజా, అన్వర్ సుల్తాన, జంగ బాబు, సురేందర్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

జనగామ రూరల్: సావిత్రి బాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చౌడారం జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు దాత రమేష్ సహకారంతో పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు యాసారపు కర్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధించాలన్నారు. సర్పంచ్ ముక్క రాజయ్య, ప్రధానోపాధ్యాయుడు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ హైస్కూల్‌లో..

పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు విడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు రిజ్వానా, వేణు,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్‌కు రూ.5 లక్షలు మంజూరు

దేవరుప్పుల: కామారెడ్డిగూడెంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు సహకరించాలని నాయీబ్రాహ్మణులు మంత్రి దయాకర్‌రావును శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు ప్రకటించిన మంత్రి.. తెలంగాణ విమోచనోద్యమకారుడు షేక్ బందగీ స్మారక భవనం, కబరస్థాన్ అభివృద్ధి పనులకు రూ.9 లక్షల మంజూరు చేస్తూ పనులు వేగవంతం చేయాలని ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఉపసర్పంచ్ మరాఠీ కృష్ణ, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, యాదవరెడ్డి, మర్రిపెల్లి సతీష్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, సైదులు ఉన్నారు.

ఘనంగా రథోత్సవం



లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఘనంగా రథోత్సవం నిర్వహించారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా జరిగిన సీతారాముల కల్యాణోత్సవ అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంలో ఊరేగించారు. వేదపండితులు లక్ష్మీనర్సింహాచార్యులు రథోత్సవ తంతును చేపట్టారు. దేవస్థాన ఈఓ వంశీ, నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి దుర్గామాత ఉత్సవాలు

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే దుర్గామాత ఉత్సవాలకు శుక్రవారం గ్రామపెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శనివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పోచమ్మ, పెద్దమ్మ తల్లికి బోనాలు చేసి అర్ధరాత్రి ఊరుమ్మడిగా దుర్గామాతకు బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయం ఎదుట యాటలు బలి ఇవ్వడంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఏ ఇంట చూసినా బంధువులతో సందడి నెలకొంది.

మొక్కలను రక్షించాలి

బచ్చన్నపేట: వన నర్సరీల్లో వంద శాతం మొక్కలను రక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపూర్‌లో పల్లె ప్రగతి పనులను పరిశీలించి, జీపీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలు కురియగానే రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ భూముల్లో, రైతుల వ్యవసాయ పోలాలలో నాటడానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జీపీ కార్యదర్శి భరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొడకండ్ల: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొమురెల్లి సూచించారు. శుక్రవారం రాత్రి మండలకేంద్రంలో జాగృతి పోలీస్ కళా బృందం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. స్మార్ట్ ఫోన్ వాడకం పెరిగిపోయిందని, వాడకందార్లు అనవసర లింక్‌లు క్లిక్ చేస్తే మోసపోవాల్సి వస్తుందన్నారు. మండలంలో కూడా ఇలాంటి కేసులు మూడు తమ దృష్టి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రమేష్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన ఒగ్గు కళాకారుల కుటుంబాలకు జిల్లా ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం నుంచి రూ.5వేల చొప్పున ఆర్థికసాయాన్ని అందించామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చౌదరిపల్లి కుమారస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సాల్వాపూర్‌లో ఒగ్గు పోచయ్య, రామచంద్రాపూర్‌లో ఒగ్గు కిష్టయ్య మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయాన్ని అందించామన్నారు. అలాగే ఇటుకాలపల్లిలో ఒగ్గు ఐలయ్య ప్రమాదానికి గురి కాగా అతడిని పరామర్శించామన్నారు. ఒగ్గు కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కళలను గుర్తించాలని, కళాకారులను బతికించాలని కోరారు. రవికుమార స్వామి, సిద్దులు, సతీ ష్, కరుణాకర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి



పాలకుర్తి: పేద విద్యార్థులను స్థానికులు ఆదుకునేందుకు ముందుకు రావాలని మహాత్మా హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు గంటా రవీందర్ అన్నారు. మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గూడూరు, ఈరవెన్ను, పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష సామగ్రిని అందజేశారు. అనుముల మహేందర్, ప్రేమ్‌కుమార్, సోమేశ్వర్, సురేష్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దహనం

పాలకుర్తిటౌన్/పాలకుర్తి: ఇంటి వద్ద నిలిపిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి దహనం చేసిన ఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దర్దెపల్లికి చెందిన తాడెం రవి వ్యక్తిగత పని ముగించుకుని తన ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. అందరూ నిద్రపోయిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు తీసుకెళ్లి దహనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పశువుల అంగడి వేలం

బచ్చన్నపేట: బచ్చన్నపేటలో ప్రతీ ఆదివారం నిర్వహించే వారాంతపు సంతలో పశువుల అంగడి రహదారికి రూ. 5.21 లక్షల వేలం పాట వచ్చిందని సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓ అనిల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పశువుల రహదారి వేలం పాటలో 18 మంది పాల్గొనగా మండల కేంద్రానికి చెందిన నర్ర మహేందర్‌రెడ్డి పాటను దక్కించుకున్నారు. ఉప సర్పంచ్ కొండ హరికృష్ణ, వార్డు సభ్యులు, వేలం పాట దారులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ల బహూకరణ

చిల్పూరు: ఫత్తేపూర్‌లో హనుమాన్ దీక్షలు చేపట్టిన స్వాములకు శుక్రవారం రాత్రి రూ.5వేల విలువచేసే ఫ్యాన్లను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ బొల్లేపల్లి కృష్ణ అందజేశారు. కొడపర్తి రవి, రాంలాల్, వెంకట్‌రావు, తిరుపతి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న శ్రీనివాస్

బచ్చన్నపేట: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంమోహన్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ హెచ్‌ఎం కొక్కు ప్రభాకర్, గ్రామ సర్పంచ్ సుంకె లక్ష్మి, ఉప సర్పంచ్ స్వాతి, ఎంపీటీసీ దూడల కనుకయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ బొట్టు సుధాకర్, ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, నీలం వేణు, నూకల ఎల్లారెడ్డి, అయిలయ్య, ఉషారాణి, రామచంద్రం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామపట్టాభిషేకం


ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో భక్తులు

చిల్పూరు: మల్కాపూర్‌లోని వలాద్రి చెరువు సమీపంలో శ్రీసీతారామ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. అర్చకులు చొల్లేటి రాజేశ్వరశర్మ మంత్రోచ్ఛరణ మధ్య నూతన రామాలయానికి భూమి పూజ చేసిన అనంతరం రామపట్టాభిషేకం భక్తుల సమక్షంలో కనులపండుగా చేపట్టారు. ఆలయ దాత తీగల రమేష్, సర్పంచ్ కొంగరి రవి, ఉప సర్పంచ్ బబ్బుల వంశి, ఎంపీటీసీ మునిపల్లి సుధాకర్, ఏడవెల్లి మాధవరెడ్డి, బబ్బుల శంకరయ్య, పాలేపల్లి వెంకట్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, వరప్రసాద్, వెన్న రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి , అలుగు అశోక్, సతీష్ ఉన్నారు.

భగవద్గీతను ఆచరించాలి



బచ్చన్నపేట: సర్వ మానవాళి సుఖశాంతులతో ఉండడానికి అందరూ భగవద్గీతను చదివి అందులోని ధర్మ మార్గాలను ఆచరించాలని అచల యోగ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీ బ్రహ్మానంద రాపెల్లి శ్రీధరస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫౌండేషన్‌లో అచల శ్రీశ్రీశ్రీ వివేకానంద ఆగోలు రాజయోగీశ్వరుల 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల సేవలను మనం స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీజేపీలో చేరిక

దేవరుప్పుల: మండలంలోని రామరాజుపల్లికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం మోదీ తప్ప మరోకరు ప్రత్యామ్నయంలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి, జిల్లా అధికారి ప్రతినిధి సృజన్, గుంటి అజయ్, కాసాని సత్తయ్య ,రాజోజు నరసింహచారీ, కావటి మల్లేష్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర సాధన పేరిట అధికారంలోకి వచ్చి నిజాం పాలనకు తీసిపోకుండా పరిపాలన కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జనగామ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురంలో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోసం ముఖ్యనాయకుల భేటీ సమావేశానికి అల్లం ప్రదీప్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నేరవేర్చిన కాంగ్రెస్ పట్ల కనీస కృతజ్ఞత భావం లేకుండా సీఎం కేసీఆర్ ప్రతిపక్షాలు లేకుండా కుట్రలు చేస్తూ కుటుంబ పాలనకు వెంపర్లాడుతున్నాడే తప్ప పునర్నిర్మాణ లక్ష్యం నీరుగార్చారన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో జంగా రాఘవరెడ్డి బరిలో నిలువనన్న ప్రకటన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం కోసం సత్వరమే ఇన్‌చార్జ్‌ని నియమించేందుకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దగ్గరికెళ్లేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. పీసీసీ మాజీ కార్యదర్శి గంగు కృష్ణమూర్తి, ఉప్పల సురేష్‌బాబు, జిల్లా కార్యదర్శి కాసారపు ధర్మారెడ్డి, మాజీ ఎంపీపీ యాకసోమయ్య,తొర్రూరు మండల అధ్యక్షుడు చివిటి సాధకార్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్,గండిపెల్లి యాకయ్య,రాహల్, రవీందర్,నల్ల సత్యనారాయణ, కాసాని ఎర్రయ్య,ఇప్ప వీరారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీటీసీలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓగా మండలంలోని ఇప్పగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో శివునిపల్లి ఈఓగా పనిచేసే కుర్ర చిరంజీవి మార్చి 2న ఏసీబీకి పట్టుబడిన విషయం పాఠకులకు విదితమే. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఈఓగా శ్రీకాంత్‌కు బాధ్యతలు అప్పగించగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు, గ్రామస్తుల సహకారంతో గ్రామ అభివృద్ధికి నిబంధనల మేరకు పనిచేస్తానన్నారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌కు ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, గుర్రం రాజు, వార్డు సభ్యుడు బూర్ల రాజు తదితరులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మత్స్యకారుల సమస్యల్ని పరిష్కరించాలి


మాట్లాడుతున్న మునిగెల రమేష్

స్టేషన్‌ఘన్‌పూర్: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులకు బడ్జెట్ కేటాయింపులో వివక్షతను నిరసిస్తూ దేశవ్యాప్తంగా మత్స్యకారుల సమస్యలపై ఈనెల 3న నిర్వహించనున్న ఢిల్లీ, జంతర్‌మంతర్ వద్ద మత్స్యకారుల మహాధర్నా కార్యక్రమాన్ని పురస్కరించుకుని డివిజన్‌కేంద్రంలో మత్స్యసొసైటీలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులపై వివక్ష చూపుతుందని, మత్స్యకారుల సమస్యల్ని పట్టించుకోవడం లేదన్నారు. సంఘం మండల అధ్యక్షుడు బిక్షపతి, కార్యదర్శి గోనెల వెంకన్న, గోనెల అనీల్, మునిగెల కుమారస్వామి, గోనెల చందు, నీల లింగయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

చిల్పూరు: రాయతీలు కల్పించడమే కాదు.. సురక్షిత ప్రయాణం ఆర్టీసీబస్సుల్లోనే అని వరంగల్-1 డిపో మేనేజర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని వెంకటాద్రిపేటలో శుక్రవారం ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం సర్పంచ్ కందుల రఘుపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం గ్రామాల్లో చేపట్టగా మంచి స్పందన వస్తోందని ప్రయాణికుల సమస్యలను తెలుపడంతో వాటిని వెంటనే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, విద్యార్థులకు రాయితీలు కల్పిస్తున్నామని అదే విధంగా ప్రయాణీలకు సంఖ్య ఎక్కువగా ఉండే గ్రామాలకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంతెన లవన్, దేవి తిరుపతి రెడ్డి, ఆర్టీసీ ఎస్సీ ఎస్‌ఆర్ కుమార్, సిఆర్‌సీ యాదగిరి ఉన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలి


దేవరుప్పుల: మాట్లాడుతున్న ఎంపీపీ సావిత్రి

దేవరుప్పుల: చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై ప్రతీ ఒక్కరు గుర్తెరిగి తమ పరిసరాల మహిళలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ బస్వ సావిత్రి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన పోషణ పక్షోత్సవాల మండలస్థాయి సమావేశానికి డీబ్ల్యూఓ జయంతి అధ్యక్షత వహించగా ఆమె మాట్లాడారు. కౌమార దశ బాలికల నుంచి జన్మించిన శిశువుల ఆరోగ్య పరిరక్షణ వరకూ విస్తృత సేవలందిస్తున్న ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ల పోషకాహారాలతో కూడిన వంటకాల ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌కుమార్, సర్పంచ్ ఈదునూరి రమాదేవి, ఐకెపి ఎపిఎం వెంకట్‌రెడ్డి, ఎపీఆర్‌ఓ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, అన్వరున్నీషాబేగం, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నర్మెట: పౌష్టికాహారంతో పాటు దినచర్యలో యోగాను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతాదేవి అన్నారు. మండలంలోని బొమ్మకూర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహారంతో లాభాలు, యోగా ఆవశ్యకతలను వివరించారు. ఈ సంథర్భంగా ప్రాథమిక పాఠశాలలో ఆసనాలు వేసి యోగాపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కవిత, స్వప్నాదేవి, నర్సింహారెడ్డి, రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బచ్చన్నపేట: పౌష్టికాహంర తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని మండలంలోని రామచంద్రాపూర్ అంగన్‌వాడీ టీచర్ పెరుమాళ్ల సునీత అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం సందర్భంగా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం శ్యామ్‌మోహన్‌రాజు, ఉపాధ్యాయులు అయిలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: సమతుల్యమైన పోషకాలు ఉన్న చిరుధాన్యాలను ప్రతీ ఒక్కరూ వినియోగించాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడారు. అన్ని రకాల చిరుధాన్యాలను వాడటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిరుధాన్యాల్లో అనేక పోషకాలు ఉంటాయని, ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఫ్లోరెన్స్, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, హెచ్‌ఎంలు ఎండీ.అజామోద్దీన్, సదామోహన్, సూపర్‌వైజర్ సంధ్యారాణి, వార్డు సభ్యురాలు గట్టు వాణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

లంబాడీలు ఐక్య పోరాటాలు చేయాలి


మాట్లాడుతున్న మంగీలాల్‌నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్: లంబాడీలు తమ న్యాయమైన హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ భూక్య మంగీలాల్‌నాయక్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ నునావత్ సుమన్‌నాయక్ అధ్యక్షత శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతకులు బాగు పడుతాయని లంబాడీలు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారన్నారు. అయితే స్వరాష్ట్రంలో లంబాడీలపై దాడులు, అణచివేత, హత్యలు అధికమయ్యాయన్నారు. లంబాడీలు రాజ్యాధికార సాధన దిశగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్, భూక్య రవీందర్, బానోతు బాలరాజు, రాజేష్, అజ్మీరా దేవి, చంటి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ


స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ

తరిగొప్పుల: మండలకేంద్రంలోని మద్యం దుకాణాలను స్టేషన్‌ఘనపూర్ ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నందిని, కాళికా మాత మద్యం దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై జలీలుద్దీన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చిల్పూరు: మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ లొడెం రజిత రవీందర్, ఎంపీటీసీ మారబోయిన అయిలమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడ సంపత్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాలి ప్రవీన్, వెలిశాల కనుకయ్య, పులిశాశి రాజయ్య, రాజేందర్, బూర రాజు, కనుకయ్య, మోతె రాములు, గూళ్ల ప్రకాష్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని శివునిపల్లిలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేంద్రియాల్లో కళ్లు ప్రధానమైనవని, 18 సంవత్సరాల వయస్సు నిండిన వారందరూ ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, సీఐ రాఘవేందర్, ఎంపీఓ సుధీర్, ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, శివునిపల్లి ఎంపీటీసీ గుర్రం రాజు, వార్డు సభ్యుడు బూర్ల విష్ణు, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీకాంత్, డాక్టర్ సంధ్య, నాయకులు మాచర్ల గణేష్, తోట సత్యం, గుర్రం శంకర్, కొంతం శ్రీను, బైరు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.